# నరసింహావలోకనం

(స్వీయ చరిత్ర)

యాతగిరి శ్రీరామ నరసింహారావు

ఎమెస్కో

# ఇదీ వరస...


| | | |
|---|---|---|
| 1. | పుట్టుపూర్వోత్తరాలు | 15 |
| 2. | విద్య – ఉద్యోగం | 33 |
| 3. | సహకార సమరవీరులు | 74 |
| 4. | సమితి కార్యకలాపాలు | 77 |
| 5. | ప్రఖ్యాత పురుషులు | 112 |
| 6. | రాష్ట్రపతులు – ప్రధానులు | 120 |
| 7. | ఆదర్శమూర్తులు | 132 |
| 8. | దేవాలయాలు – చరిత్రకారులు | 147 |
| 9. | సత్రాలు – చెరువులు | 160 |
| 10. | టవును హాలు – ఇతరసంస్థలు | 171 |
| 11. | పత్రికాప్రముఖులు – సాహితీవేత్తలు | 190 |
| 12. | స్వాతంత్ర్య సమరవీరులు | 213 |
| 13. | వివిధరంగాల ప్రముఖులు | 285 |
| 14. | ఆశలు – ఆశయాలు | 345 |

# పుట్టుపూర్వోత్తరాలు

## మూలస్థానం

310 ఏండ్ల క్రితం మా యాతగిరి వారి మూలస్థానం కర్ణాటకలోని యాదగిరి. అది నేటి జిల్లా కేంద్రం. 1703లో మా వంశం అక్కడి నుండి ఇక్కడికి వలస వచ్చినట్లు మా మఠంలో గల శిలాశాసనం తెల్పుతున్నది. ఈ పవిత్రమైన ప్రదేశంలోకి మా వంశస్థులు అడుగుపెట్టినది ఆషాఢమాసం అమావాస్య. అందువల్ల నాకు అమావాస్య ఎంతో ఇష్టం. ఇక్కడకు వలస వచ్చిన మా వంశ ఆదిదంపతులు వేంకట్రాయాచార్యులు, సోనాబాయి. నాది ఎనిమిదో తరం. ఇంత ఎక్కువ కాలంనుండి రాజమహేంద్రిలో నివాసమున్న బ్రాహ్మణ కుటుంబం మరేదియు లేదు. ఇది పత్రికా ప్రకటనద్వారా తేలిన అంశం.

మేము మధ్వులం. అంటే ద్వైతశాఖ. శంకర, రామానుజ, మధ్వాచార్యులు త్రిమతస్థులు, మేము కాశీయాత్ర చేస్తే, అక్కడి మహాశివుడిని అర్చించి, క్షేత్రపాలకుడు బిందుమాధవస్వామిని దర్శించాలి. అలాగే రామేశ్వరం వెళితే అక్కడి క్షేత్రపాలకుడు సేతుమాధవుడిని దర్శించాల్సిందే. మాలో ఎవరైనా కాశీ, రామేశ్వరాలు యాత్రచేసి వచ్చిన తర్వాత ఇంట్లో మగశిశువు (కుమారుడు గాని మనుమడు గాని) జన్మిస్తే బిందుమాధవ అని గాని, సేతుమాధవ అని గాని నామకరణం చేస్తారు. దీనికొక ఉదాహరణ విజయేశ్వరంలో సేతుమాధవ, బిందుమాధవ ఉన్నారు. కాశీయాత్ర చేసి వచ్చిన మా వంశ మూలపురుషుడు వేంకట్రాయాచార్యులు గారు తమకు జన్మించిన పుత్రునికి బిందుమాధవ అని పేరు పెట్టారు. ఆయన యజ్ఞం చేయడం వల్ల బిందుమాధవ దీక్షితులు అయ్యారు.

మాది పురోహిత కుటుంబం. యజ్ఞయాగాది క్రతువులను నిర్వర్తించినవారు మా యాతగిరివారి వంశంలో ఎందరో ఉన్నారు. కనుకనే కొందరికి సోమయాజులు పేర్లు కూడా ఉన్నాయి. బిందుమాధవ దీక్షితుల కుమారుడు పూర్ణ సోమయాజులు. వీరి మునిమనుమడికి పూర్ణయ్య అన్న పేరు పెట్టారు. వారే మాతాతగారైన పూర్ణయ్యపంతులుగారు. పూర్ణ సోమయాజులు కుమారుడైన సత్యాధిరాయాచార్యులు

మిర్తిపాడునుండి బుచ్చెంపేటకు వెళ్ళే దారిలో ఒక పెద్ద నుయ్యిని తవ్వించారు. దానిని ప్రజలు యీ నాటికీ ఉపయోగించుకోవడం నేను కన్నులారా చూసి, ఎంతో సంతోషించాను. సత్యాధిరాయాచార్యులు గారి కుమారుడు నరసింహాచార్యులు గారు, వీరేశలింగంగారు బాల్య స్నేహితులు. మా ఇంటి దగ్గర్లోని శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయానికి ఆనుకుని ఉన్న వీథిబడిలో శ్రీ పులిపాక అమ్మన్న వద్ద చదువుకున్నట్లు మా ముత్తాత గారు తమ స్వీయ చరిత్రలో రాసుకున్నారు. ఆయన స్వీయచరిత్రను పూర్తిగా రాసుకోలేదు. ఆయన చనిపోయేముందు 1933లో చెబుతూంటే మా తాతగారు రాసారు. వీరేశలింగంగారికి, మా ముత్తాత గారికి పరస్పరవిరుద్ధమైన భావాలున్నప్పటికీ చివరివరకు స్నేహితులుగానే ఉన్నారని మా తాతగారు చెప్పేవారు. ఒకరింటికి మరొకరు వస్తూండేవారని కూడా చెప్పేరు. ఆంధ్రదేశమంతటా యజ్ఞయాగాది క్రతువులను దిగ్విజయంగా నిర్వర్తించి, కీర్తిని, ధనాన్ని సంపాదించి, విశేషంగా దానధర్మాదులను మా వంశంలోని యాతగిరి వేదవ్యాసాచార్యులు చేసారని ఆ స్వీయచరిత్రలో ఉంది. వీరే ధవళగిరికి సోపానములు 1800 సంవత్సరంలో నిర్మింపచేసారని దానిలో ఉంది. ఆ విషయాన్ని ధవళేశ్వరం జనార్దనస్వామివారి రథశాలపై ఇటీవల వేసిన శిలాశాసనంలో పేర్కొన్నారు. అలాగే మా సందుకు సమీపంలోని వీరేశలింగం గారి జన్మగృహంలో మా ముత్తాతగారి ఫొటోను ఏర్పాటుచేయడం జరిగింది.

మా తాతగారైన పూర్ణయ్య పంతులు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు నాటకరంగ సహచరులు. స్వాతంత్ర్య సమరశీలి. రాజమహేంద్రిలో మొదటి ఖాదీ వస్త్రాలయాన్ని నిర్వహించారు. మా నాన్నగారైన వేంకటనరసింహారావు ఉండేశ్వరపురంలో కొన్నాళ్ళు స్వంత వ్యవసాయం చేసారు. అప్పుడే అక్కడొక బంగ్లాను కట్టుకోవడమే కాదు, మధురపూడికి వెళ్ళే పుంత ప్రారంభంలో ప్రజలకోసం పెద్ద బావిని నిర్మింపచేసారు. అలాగే నేను కూడా మునిసిపల్ కాలనీలో ఒక చిన్న నూతిని ఆర్ట్సు కాలేజీ ప్లానింగ్ ఫోరం కార్యదర్శిగా 1959లో నిర్మింపచేసాను.

1703లో మా వంశం యాదగిరినుండి వలస వచ్చిన తర్వాత ఆ మూలస్థానాన్ని మా వంశస్థులెవరూ సందర్శించలేదు. ఆ సందర్శనం నా చిరకాల వాంఛితం. మా దౌహిత్రుడు చిరంజీవి ధర్మపురి నాగరాజు ఇంటర్నెట్ ద్వారా తెల్సుకున్న అంశమేమంటే అది కర్ణాటకలోని యాదగిరిలో కోట ఉండేదని, శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవాలయం ఉండినట్లు, అసలు పేరు యాతగిరి అని, మా ఇలువేల్పు లక్ష్మీ

నరసింహస్వామి. ఈ నాటికీ రాజమహేంద్రిలోని అతిప్రాచీనమైన ఆలయంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామినే కొలుస్తున్నాం. మా ఇంటికి ఆనుకునే ఉన్న నరసింహస్వామి ఆలయం (11వ శతాబ్దం). అందువలననే మా వంశంలో ఎక్కువ మంది నరసింహస్వాములే. 2012 ఫిబ్రవరిలో యాదగిరిని సందర్శించాను. అక్కడ పాదం పెట్టగానే ఎంతో ఉద్విగ్నతకు లోనైనాను. ఆ మట్టిని బొట్టుగా పెట్టుకున్నాను. చెప్పనలవి కాని ఆనందానికి లోనైనాను. నాతో కూడా మా చిన్న తాతగారి ఆఖరి మనుమడు నరసింహాచార్య వచ్చాడు. అతనికి కన్నడం రావడం వల్ల మా యాత్ర జయప్రదమైంది. అక్కడి ప్రముఖ లాయర్ శ్రీ శ్రీనివాసరావు ఇచ్చిన సహకారం మరువలేనిది. స్థానికంగా యాదగిరి వారెవరైనా ఉన్నారా అని వాకబు చేసాం. అది ఒక్కరోజులో తేలే విషయం కాదుగా!

నా స్వస్థలం రాజమహేంద్రి. జన్మస్థలం పెద్దాపురం. పెద్దాపురం దర్గాపేట చివర్లోని మామిడితోటలో మా అమ్మమ్మ అప్పలి సుభద్రమ్మ కట్టుకున్న విశాలమైన పెంకుటింట్లో 18-10-1936న జన్మించాను. ఆ కొత్త ఇంట్లో జన్మించిన వారిలో నేనే ప్రథముడను అని మా అమ్మమ్మగారు, అమ్మగారు అనేవారు. ఆ ఇంట్లో రెండు వైపులా ఖాళీ స్థలమే. వెనుక ఒక మూల మంచినీటి బావి, మిగిలిన స్థలంలో వివిధ పండ్ల జాతుల మొక్కలుండేవి. దానిమ్మ, సపోటా, మామిడి, అరటి, అల్లనేరేడు వగైరా... వగైరా, పూలమొక్కలు సరేసరి. అన్ని మొక్కలున్న తోటను మరే ఇంట్లోను నాకు కనబడలేదు. అప్పట్లో వేసవి సెలవులు ఏప్రిల్, మే, జూన్ నెలలు. అలా దాదాపు దశాబ్దం కాలం పాటు అక్కడే గడిపేవాళ్ళం. మా అక్కచెల్లెళ్ళు, మా దొడ్డమ్మ గారి పిల్లలు, దాదాపు పదిమందిమి అలా వేసవి సెలవులను ఎంతో ఉత్సాహంగా గడిపేవాళ్ళం.

పెద్దాపురంలో ఆకలెక్కువ. కనుక రోజుకి నాల్గు వేళలా అన్నం తినేవాళ్ళం. మా అమ్మమ్మగారి సహనాన్ని చెప్పుకోవాలి. పెద్దపళ్ళెంలో అన్నం కలిపి, అందరికీ తలో ముద్దా పెట్టేది. మేం ఎంత అల్లరి చేసినా ఆమె ఏమీ అనేది కాదు. ఆమెకు 30 సంవత్సరంలోనే భర్త శ్రీనివాసరావు స్వర్గస్థులయ్యారు. మా తాత శ్రీనివాసరావుగారి స్వస్థలం విజ్జేశ్వరం. అక్కడ కూడా ఆకలెక్కువే! ఆయన మరణించిన తర్వాత, తన అన్నగారైన కోటీ శేషగిరిరావు గారింటికి మకాం మార్చారు. ఆయన గొప్ప ప్లీడరు. పెద్దాపురం బార్ అసోసియేషన్ స్థాపకాధ్యక్షులు. అలాగే అక్కడున్న క్లబ్‌కు కూడా. వారున్నది ప్లీడర్ల వీథి. అక్కడున్న పెద్ద ప్లీడర్లంతా జట్కాబండ్లపై ఉదయం పదిగంటలకు